

[illegible] నాకు తెలిసిందే అయినా, ఎప్పుడూ గుర్తుకు రానేలేదు.

వచ్చిన ఆరో సంబంధంకూడా కట్నం ఇవ్వలేక తప్పిపోయిందని, తెలిసి ఆ మర్నాటి ఉదయం సుశీలక్క శవం పెరటి బావిలో తేలినప్పుడు నాకు గుర్తుకు రాలేదు.

పెన్షన్ రాళ్ళకి తన బ్రతుకు బరువు మోసే శక్తి లేదని ఒక వంకా, సుశీలక్క చావు మరో వంకా క్రుంగదీస్తే, దిగులుతో మంచాన పడి నాన్న మరణించి నప్పుడుకూడా గుర్తుకు రాలేదు.

నాన్న పోయాక ఓదార్చడానికి వచ్చిన మామయ్య—ఇద్దరు పెళ్ళాలు ఆత్మహత్య చేసుకున్నాక, మూడో పెళ్ళాం లేచి పోయిన బట్టతల గల, భాగ్యం గల మా మామయ్య—'నీ మెడిసిన్ చదువు కేం భంగం రాదు. నే నున్నాను, శాంతీ' అని భరోసా ఇచ్చినప్పుడు సైతం గుర్తుకు రాలేదు.

ఆదే మామయ్య దగ్గరికి ఆరు నెలల తరవాత అప్పు అడగడానికి వెళితే, ఇస్తాను రమ్మని ఇంట్లోకి పిలిచి, ఇనప్పెట్టె తెరవమని తాళా లిచ్చి, తెరుస్తున్న నన్ను వెనక నించి వాటేసుకుని మెడమీద ముద్దు పెట్టుకున్నప్పుడు అతడు తాగే చుట్ట వాసన గుప్పున కొట్టి అది ఈ నాటికీ గుర్తున్నది గాని, ఆ సంగతి మాత్రం గుర్తుకు రాలేదు.

ఫిఫ్త్ ఇయర్ మెడిసిన్ చదివేప్పుడు ఫీజు కట్టలేని నా పేరు రోల్సు లోంచి లాగేస్తే, సదరు ఫీజు చెల్లించిన కో—మెడికో రంగనాథం థియేటరుకు పిలుచుకుపోయి సినిమాచీకట్లో నా నున్నటి చెంపల మీద సుతారంగా పెదాలు ఆన్చినప్పుడుకూడా అసలు గుర్తుకు రాలేదు.

ఫైనలియర్ ఓరల్ పరీక్షల్లో ఓ ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ ప్రశ్నలు వేస్తూ, నా విశాలమైన కళ్ళలోకి చిలిపిగా చూస్తూ, తన కుడిచేతి మధ్య వేలి గోటితో నా చెక్కిలి మీద మీటినప్పుడు కూడా గుర్తుకు రాలేదు.

హౌస్ సర్జన్ చేస్తున్నప్పుడు అమ్మతో, ఆమె అనారోగ్యంతో నేను కష్టాలు పడుతున్నప్పుడు సైతం గుర్తుకు రాలేదు.

కాని—

అమ్మ పోయాక ఈ ఆరు నెలలు దారుణ నిరుద్యోగ జీవితం అనుభవించాక ఒక శుభ ముహూర్తాన ఆ సంగతి గుర్తుకువచ్చింది.

ఆ సంగతి—

ఆదే సంగతి—

చిన్నప్పుడు ఎలిమెంటరీ స్కూల్లో చదివిన శతకంలో 'కాసులు గల వాడె రాజు గదరా సుమతీ' అన్న సంగతి, 'అర్థవంతున కసాధ్యము లోకము నం దేదియు గానము' అని మిత్రలాభం పాఠంలో హైస్కూలు తెలుగు మాస్టారు చెప్పిన సంగతి, 'భూమి సూర్యుని చుట్టూ మాత్రమే కాదు; ధనం చుట్టూకూడా తిరుగుతుం'దని కాలేజీ లెక్చరర్ జోక్ చేసిన సంగతి—చప్పున గుర్తుకొచ్చాయి.

గుర్తు రావడమే తడవు ఒక్క క్షణంకూడా వృథాచేయకుండా సుమతి శతకకారుడికీ, ఎస్. ఎస్. ఎల్. సి. తెలుగు మాస్టారుకూ, కాలేజీ జోకుల లెక్చరర్‌కూ టోకుగా ఒక్క నమస్కారం మనస్సులో చెప్పుకుని, డబ్బు. . . డబ్బు. . . డబ్బు. . . లక్షలు సంపాదించాలి,కసిగా సంపాదించాలి అని నిర్ణయించుకొని—అటు సిటీ, ఇటు బస్తీ కాని ఈ ఊళ్ళో క్లినిక్ ఓపెన్ చేశాను. ఆరు నెలలకే ఆ క్లినిక్ స్థానంలో 'శాంతి నర్సింగ్ హోమ్' వెలిసింది. సంవత్సరం తిరిగేసరికల్లా అది అద్దె ఇంట్లో నించి స్వంతభవనంలోకి మకాం మార్చింది.

మరో ఆరు నెలలకి రాజహంస లాంటి అందమైన కారు హాస్పిటల్ ముందు నిలిచింది.

ఇంకో ఆరు నెలలు ముగిసేసరికి, అన్ని ఆధునిక సౌకర్యాలతో నా నివాస గృహం 'నిర్మలా భవన్' ఆ టౌన్‌లోని అన్ని మేడల తలలను తన్ని ఎత్తుగా నిలబడింది. చదువుకొనే రోజుల్లో

## రామినేని నాగరత్నమ్మ

నా స్నేహితురాలు నిర్మల జ్ఞాపకం కోసం భవనానికి ఆ పేరే పెట్టాను. నిర్మల నాకు ఎంతో సాయం చేసేది. తన మనియార్డర్సుతో నా కాలేజీ ఫీజు కట్టేది. తన చీరలే నా చేత కట్టించేది. తనవన్నీ నావే. వేరు వేరు కాము. ఇద్దరం ఒక్కటే. తను లేకపోతే ఈ శాంతి ఎమ్. బి. బి. ఎస్. కాలేదు. అసలు శాంతే ఉండేది కాదు.

నిర్మల సంపన్నుల ఏకైక పుత్రిక కాదు—మధ్య తరగతి కుటుంబీకుల కూతురు. అయినా. నే నంటే దానికి ప్రాణం. తనకు ఉండే వసతి నాతో పంచుకునేది. పంచుకొని ఆనందించేది. దాతృత్వానికి కావలిసింది సంపద కాదు. దయ గల గుండె. అలాటి 'నిర్మల' హృదయమే స్టూడెంటు లైఫ్‌లో నాకు అడుగడుగున అండగా నిలబడి, భరోసా ఇచ్చి, ఎంకరేజ్ చేసి నన్ను డాక్టర్ని చేసింది. ఎక్కడుందో పిచ్చిబొంద! ఏ మగ రాక్షసుడికి సుఖాన్నిస్తూ, పిల్లల్ని కంటూ జీవిస్తూందో! ఈ మూడేళ్ళ నించీ తన కథే నాకు తెలియదు. ఇప్పుడు ఇంత ఉచ్చ స్థితిలో ఉన్న నన్ను చూస్తే ఏమనుకుంటుందో, ఎంత సంతోషిస్తుందో!

'ఇకనైనా చక్కటి మగాణ్ణి చూచి పెళ్ళి చేసుకో' అంటుంది.

'నేను చచ్చినా మగాణ్ణి పెళ్ళి చేసుకోను' అంటాను.

'అయితే, ఓ ఆడదాన్ని చూసి ముడేసుకో' అని తన విట్టుకు తనే నవ్వుతుంది.

నేను సీరియస్‌గా 'అవును, ఆడదాన్నే చేసుకుంటాను. దాని కోసం వెతకాల్సిన అవసరం లేదు. నిన్నే చేసేసుకుంటాను' అంటూ తనని కావలించుకుని ముద్దెట్టుకుంటాను. మా బట్టతల మామయ్యలా మొరటుగా కాదు. రంగనాథంలా మరీ సున్నితంగా కాదు. చెక్కిలిపై గోటితో మీటిన ప్రొఫెసర్‌లా సుతారంగా కాదు. ఎవ్వరూ, ఎక్కడా, ఎప్పుడూ ముద్దెట్టుకోని కొత్త విధంగా . ఆ విధానం ఈ లోగా డిస్కవర్ చేస్తాను.

తాను ముద్దెట్టుకుంటున్న నన్ను తోసి పారేసి, 'నా మొగుడికి తెలిస్తే "నా పెళ్ళాన్ని ఫలానా శాంతి లేవదీసుకు వెళ్ళిందహో" అంటూ పోలీస్ రిపోర్టు ఇవ్వగలడు. జాగ్రత్త!' అంటుంది.

ఇద్దరమూ కడుపు చెక్కలయ్యేట్టు నవ్వుకుంటాము.

అన్నట్టు ఉదయం కడుపుతో వచ్చిన పేషెంట్ ధనవంతురాల్లాగా ఉంది. అదీ ఇదీ చెప్పి ఓ వెయ్యి గుంజవచ్చు ట్రీట్‌మెంటు పూర్తయ్యేసరికి.

పేద పేషెంట్ వెధవల్ని చూస్తే నాకు అసహ్యం. బిల్లు తక్కువగా పే చేయడానికి లక్ష కారణాలు చెబుతారు. సవాలక్ష సంజాయిషీలు ఒలకపోస్తారు. ఇడియట్స్! ధనికులు అలా కాదు. వాళ్ళతో జాగర్తగా మాట్లాడుతూ, గౌరవాన్ని ఇస్తూ, శ్రద్ధ ప్రదర్శిస్తూ, ఆపేక్ష నటిస్తూ ట్రీట్ చేస్తే డబ్బు పిండుకోవచ్చు.

ఆ టాక్ట్ సాధన చేయబట్టే ఇప్పుడు ఈ ఊళ్ళో నా హాస్పిటలంత పెద్దది లేదు.

నా అంత 'గొప్ప' డాక్టరూ లేదు.

నా భవనమంత పెద్ద భవనమూ, నా కారంత పెద్ద కారూ, కన్సిడరబుల్ బాంక్ బాలెన్సూ ఎవరికీ లేవు. కాని,

ఇంతటితో నా లోని ఆరాటం ఆగడం లేదు.

కసి చావడం లేదు. సంపాదించాలి. ఇంకా సంపాదించాలి. రెండు చేతులా డబ్బు సంపాదించాలి.

డబ్బు లేకపోవడం వల్ల కట్నం ఇవ్వలేకపోవడం వల్ల, అక్క ఆత్మహత్య చేసుకుంది.

డబ్బు లేకపోవడం వల్ల సంసారం సాగదీయలేక పోవడం వల్ల నాన్న పోయాడు.

డబ్బు లేకపోవడం వల్ల వైద్యం చేయించలేకపోవడం వల్ల అమ్మ కన్ను మూసింది.

డబ్బు లేకపోవడం వల్ల నా శరీరంలో పవిత్రత చచ్చింది. అందుకని ఆ లేకపోవడం మీద నాకు కసి. ఆ డబ్బంటే నాకు చెప్పలేనంత కసి.

ఇంకా సంపాదించాలి.

ఇంకా ఇంకా సంపాదించాలి.

• • •

పదేసి రూపాయల కన్సల్టేషను ఫీజు కట్టిన ఇరవై ఆరుగురు కొత్త పేషెంట్సును టెస్టు చేసి ప్రిస్క్రిప్షన్ వ్రాసి ఇచ్చేసరికి మధ్యాహ్నం రెండయింది. అది మామూలే. బద్ధకంగా రెండు చేతులు పైకెత్తి కలిపి ఒళ్ళు విరుచుకుని ఆవులించి చిటికె వేసి మళ్ళీ ఉత్సాహం పుంజుకుని 'నెక్స్ట్' అన్నాను. ఆ పూట అది ఆఖరు చీటీ.

నర్సు కేకేసింది 'వసుంధరమ్మగారూ' అని.

ఓ నిమిషం తరవాత ఓ లావుపాటి ఏభై ఏళ్ళ ముత్తయిదువా, ఆమె వెనక షష్టిపూర్తి జరిపించుకోవడానికి రెడీ అవుతున్నట్టున్న ముసలాయనా రూములోకి వచ్చారు. మధ్య తరగతి కుటుంబీకుల్లా ఉన్నారు. ఆమె నుదుటి మీద పాత నయాపైసంత కుంకుమబొట్టు పెట్టుకుంది. వెంకటగిరి నేతచీర కట్టుకుంది. మెడలో ఒంటిపేట గొలుసు. వాళ్ళు వస్తూనే నమస్కారం చేశారు. నేను వ్యాపారి తన కస్టమర్ని చూచినప్పుడు పెదాల మీద అతికించుకునే చిరునవ్వును విసిరి, తల ఆడించాను. ( నిజం! నాది వైద్యం కాదు. వ్యాపారమే. ) వాళ్ళిద్దరూ నా టేబిల్ ముందుసీట్లలో కూర్చున్నారు.

'చెప్పండి' అన్నాను.

ఆమె నా ముఖంలోకి ఆపేక్షగా, ఆప్యాయంగా, తదేకంగా చూస్తూంది.

ఆయన చెబుతున్నాడు.

'నేను ఈ ఊరి జూనియర్ కాలేజీకి ఇటీవల ట్రాన్స్‌ఫరై వచ్చిన తెలుగు పండిట్‌ని.'

'తెలుస్తూనే ఉందిగా వేషం!', మనసులో అనుకున్నాను.

'గ్లాడ్ టు మీట్ యూ!' అన్నాను పైకి.

'ఈమె నా భార్య' అన్నాడు.

ఆమె రెండు చేతులు జోడించి నమస్కారం చేసింది.

స్వీకరించాను.

'ఈమెకు అరికాళ్ళు మంటలు. రాత్రులు నిద్ర పట్టదు. గుండెల్లో దడ' అన్నాడు.

'ఎస్.'

'అంతే. . . తమరు పరీక్షించి, వైద్యం చేస్తే. . .' మధ్యలో ఆగాడు.

నా చూపులు వసుంధరమ్మగారి వేపు మళ్ళినాయి.

'మీ వయస్సు?'

## సమత కావాలంటే...

సోమరితనానికి
బానిసై, బంధించబడిన
విలాసపు గాలులు
స్వతంత్రంగా వీచినప్పుడు...
ఈ వ్యవస్థను
అందంగా స్థాపించిన
మాట్లాడలేని చెట్లను
బిగ్గంగా అలుకున్న
ఇనుపతీగల పట్టు సడలి
వాటిని వదలినప్పుడు...
నా తల్లి గర్భంలో పచ్చగడ్డి
సమంగా మొలుస్తుంది.
ప్రతి ముంగిలీ ముగ్గులతో
నవ్వుతుంది.

—అలిశెట్టి ప్రభాకర్

ఖరీదైన ఫారిన్ బహుమతులూ, పెట్టిన పదిహేను వందల రూపాయల చీరా నా మనసుకు మరీ బాగున్నాయి.

వసుంధరమ్మ గారి ఇంటికి భోజనానికి పోయి ఉంటే ఈ మధురానుభవం మిస్ అయి ఉండేదాన్ని.

సేట్ లాల్‌జీ ఏకైక పుత్రిక నా హాస్పిటల్లోనే పురుడు పోసుకొని, లక్షల ఆస్తికి వారసుడైన పండంటి కొడుకును ఎత్తుకొని ఇంటికి పోయింది. వసుంధరమ్మకు నేను ఇచ్చిన వాగ్దానం గుర్తున్నా, లాల్‌జీ అంతటి వాడు స్వయంగా వచ్చి సంక్రాంతి పూట తన ఇంట చేయి కడగాలి అని అడిగినప్పుడు కాదనలేక పోయాను. మనసు ఆపే పోయింది. అందుకని ఆ పండగ పూట వాళ్ళ కారులో వాళ్ళ ఇంటికే అతిథిగా పోయాను.

•

వాళ్ళ మర్యాద, మన్నన, ఖరీదైన వాళ్ళ ఇంట్లో ఫారిన్ స్మగుల్డు వస్తువులు, వాళ్ళిచ్చిన బహుమతులు నాకు సంతోషాన్ని ఒకవైపు ఇచ్చినా, మరో వైపు కసిని పెంచాయి. సంపాదించాలి. ఇంకా సంపాదించాలి. వాళ్ళకంటె ఎక్కువగా డబ్బు పోగెయ్యాలి. ఇవే నిశ్చయాలతో తిరిగి వచ్చి ఇంట్లో కాలు పెట్టే సరికి గడియారం సాయంత్రం నాలుగు గంటలు మోగించింది. లక్ష్మి ఓ ఉత్తరం ఇచ్చింది, ఎవరో ఇచ్చిపోయారంటూ.

ఎవరై ఉంటారా అనుకొంటూ కాగితం మడతలు విప్పాను.

"డాక్టర్ శాంతి గారికి —

ఆశీస్సులు. ఈ రోజు మధ్యాహ్నం మా ఇంటికి అతిథిగా రావడానికి మీరు అంగీకరించారు. చాలా సంతోషించాము. నిన్న సాయంత్రమే వచ్చి నేను గుర్తు చేసి పోయాను. సరే అన్నారు. మా ఆవిడ సగం రాత్రికే లేచి హడావిడి చేసి ఎన్నెన్నో పిండి వంటలు స్వయంగా చేసింది. మీరు వస్తే ఎక్కడ కూర్చో బెట్టాలో, ఎలా వడ్డించాలో, ఎలా మీకు తినిపించాలో కూడా ఆలో చించి పెట్టుకొంది.

నేను మిమ్మల్ని పిలుచుకు పోవడానికి 12 గంటలకే వచ్చాను. మీరు లేరు. మళ్ళీ మళ్ళీ నాలుగు సార్లు వచ్చాను. నిరాశే ఎదురయింది. మీ రింకా ఇంటికి రాలేదు.

మా ఆవిడ మీ కోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తూ వాకిట్లోనే కూర్చుంది. ప్రతి కారు శబ్దమూ మీ కారుదేనని ఆశపడుతోంది. నిరీక్షిస్తోంది. నిరాశ పడుతోంది.

ఈ సరికి మీరు ఎక్కడో భోజనం చేసి ఉంటారు. అయినా, ఆమె నిరాశను పోగొట్టడానికి, సంతోషపెట్టడానికి ఓ నిమిషం మా ఇంట్లో ఉండండి.

సివర్సు కాలనీలో ఏడవ వరస రెండో ఇంటి వెనక పోర్షనులో మే మున్నాము.

దయచేసి ఈ ఉత్తరం చూడగానే రండి.

మీకోసం ఎదురుచూస్తుంటాము.

ఆశీర్వచనాలతో—

కాదు,

నమస్కారాలతో . . .

—నరసింహం మాస్టారు."

ఒక్కసారి వెళ్ళి వద్దామా అనిపించింది. ప్చ్ — అబ్బ! చాలా అలసటగా ఉంది. కాస్సేపు రెస్టు తీసుకొని తర్వాత చూద్దాం అనుకొన్నాను.

నిద్రలేచి స్నానంచేసి బట్టలు వేసుకొని బయటి కొచ్చేసరికి నా కోసం ఎవరో వెయిట్ చేస్తున్నారు. వసుంధరమ్మగారు పడిపోయిందని, నన్ను రమ్మని ఆయన కోరారు. ఆయన బోటనీ లెక్చరర్ అట. మెడికల్ చెస్టు తీసుకొని కారులో బయలుదేరాము.

మేము కారు దిగేటప్పటికి అంతా అయిపోయింది. నరసింహం మాస్టారు వసుంధరమ్మగారి శవం మీద పడి ఏడుస్తున్నారు. ఆమె ఏంగ్జయిటీకి, టెన్షన్‌కి తట్టుకోలేక కన్ను మూసి ఉంటుంది. చుట్టూ నలుగురో, అయిదుగురో జనం చేర్చారు. కొత్త ఊళ్ళో—అందులో టౌన్‌లో ఎవరి చావుతో ఎవరి కేం పని?

మాస్టారు నన్ను చూస్తూనే బావురుమన్నారు. 'వచ్చారా, తల్లీ! ఇంటికి వచ్చారా? ఇటు మీ కోసం నిరీక్షించి, నిరీక్షించలేక కన్ను మూసిన ఈ పిచ్చిదాని శవాన్నొకసారి చూడండి. అటు మీ కోసం సిద్ధపరిచిన వంటకాలవైపొకసారి చూడండి.''

రెండే గదుల ఆ ఇంట్లో అవతలి గదిలో అందంగా అమర్చిన భోజన పదార్థాలు.

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

మాస్టారుగా రన్నారు: 'మీరు భోజనానికి వస్తామని అంగీకరించిన నాటినించి ఆవిడకి ఒకటే తపన — ఏం చేయాలి? ఎలా చేయాలి? ఎలా వడ్డించాలి? అని. మెడలో ఉన్న ఆ ఒక్క ఒంటిపేట గొలుసూ తాకట్టు పెట్టి మీకు విందు ఏర్పాటు చేసిందమ్మా. తన కూతురు లాగా మీరు తింటూంటే కళ్ళారా చూడాలనుకుంది. కాని, మీరు తినడానికి రాకముందే కళ్ళు మూసుకొంది.'

నా చెంపలపైకి కన్నీరు జారింది.

నన్ను పిలవటానికి వచ్చిన బోటనీ మాస్టారును మెల్లగా అడిగాను. 'అవును. వీరి అమ్మాయీ, అల్లుడూ పండక్కి వచ్చారు కదా? ఎక్కడ?'

'మీకు తెలియదా, డాక్టర్? వీరి అమ్మాయీ, అల్లుడూ నాలుగేళ్ళ క్రితం సంక్రాంతి పండక్కి ఇంటికి వస్తూ కారు ఏక్సిడెంటులో మరణించారు. అప్పట్నించి ఈమెకు మతి స్థిరమూ లేదట. ఆరోగ్యం బాగానూ లేదట.'

నరసింహం మాస్టారు ఏడుపు సంబాళించుకొని గద్గదస్వరంతో అన్నారు: 'అవునమ్మా! విజయమ్మ మా ఒక్కగానొక్క కూతురు. ప్రమాదంలో పోయిం దది. పోయిందంటే ఆవిడ ఊరుకొనేదికాదు. ప్రతి సంక్రాంతికి వస్తుందని ఆశ. అమ్మాయి అచ్చుబాటు మీలో చూచుకొని ఈ వెర్రాళ్ళ విందు సంబరపడింది. అదిగో, అమ్మాయి ఫొటో ... దానితో ప్రతి రోజూ మాట్లాడుకొనేది.'

గోడపై ప్రేలాడుతున్న ఫొటోకేసి చూచాను.

'నిర్మల!' ఆశ్చర్యంతో పెద్దగానే అన్నాను.

'అవును. మా పాపాయి నిర్మల మీకు తెలుసా, అమ్మా?' నరసింహం మాస్టారు ఆదుర్దాగా అడిగారు.

తెలియదన్నట్టు తల అడ్డంగా ఊపాను.

చెంపలమీదుగా జారే కన్నీటిని తుడుచుకున్నాను. 'వసుంధరమ్మగారిని నేనే చంపాను' అనుకొన్నాను. కాదు అన్నాను.

నాలో ఏదో కదలిక కలిగింది. ఏదో నిశ్చయం ఏర్పడింది. ఏదో సంకల్ప బీజం మొలకెత్తింది.

ఇప్పుడు నాకు కన్నీరు రావడంలేదు. కన్నీరు ఆగింది. నాలో ఒక చైతన్యం ఏర్పడింది. ఒక దీపం వెలిగింది. కళ్ళ ముందున్న పరదాలు తొలగిపోయాయి. చిరిగిపోయాయి.

మెల్లగా పక్క గదిలోకి పోగాను. పదార్థాల పాత్రలు పెంచిన టేబిల్ పక్క నిలబడి వాటిని పరిశీలించాను. అవి చేగోడీలు. వాటిలో ఒకటి తీసుకొని ఒక్కముక్క తుంచి నోట్లో వేసుకొంటే, సేట్ లాల్‌జీ ఇంట్లో తిన్న ఖరీదైన పదార్థాల రుచిని మించిన రుచి — అమృతం లాంటి రుచి — అమ్మ మనసు లాంటి రుచి — మమత లాంటి రుచి.

• • •

శాంతి నర్సింగ్‌హోమ్ స్థానే వెలసిన 'వసుంధరా ఉచిత ప్రజా వైద్యశాల' ప్రారంభోత్సవ సభలో ఆహూతులల చప్పట్ల మధ్య నే నేం మాట్లాడానో నాకు గుర్తులేదు కాని, నా గుండె ప్రమిదలో వెలిగిన దీపాన్ని, దాని కాంతిని పది గుండెలకు పంచుతాను అని మాత్రం ప్రమాణం చేశాను. ★